ఆంధ్రజ్యోతి **
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శనివారం 6 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.124	200	220
సూర్యాపేట	రూ.110	155	177
నల్లగొండ	రూ.107	160	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.0

భువనగిరి ఖిల్లా లోగో డిజైన్ పోటీలు

- ఈ నెల 10లోపు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు



భువనగిరి టౌన్, జనవరి 5: చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన భువనగిరి ఖిల్లాపై చేపట్టాల్సిన అభివృద్ధి పనుల డీపీఆర్ చివరి దశకు చేరింది. డీపీఆర్‌లో భాగంగా భువనగిరి లోగో డిజైన్, ట్యాగ్‌లైన్ కోసం టూరిజంశాఖ నామినేషన్లను ఆహ్వానించింది. అందుకు ఈ నెల 10వ తేదీ చివరి గడువు. భువనగిరి ఖిల్లా ఇతివృత్తాన్ని చాటేలా లోగో రూపకల్పన, క్యాచీ ట్యాగ్‌లైన్‌ను పంపాలని అధికారులు తెలిపారు. స్థానికులతో పాటు దేశవాసులు, ప్రవాస భారతీయులు సైతం ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. లోగో లేదా ట్యాగ్‌లైన్‌ను లేదా రెండింటినీ రూపొందించి పోటీల్లో పాల్గొనవచ్చు. పోటీల్లో గెలుపొందిన లోగో, ట్యాగ్‌లైన్‌పై పర్యాటకశాఖకు మాత్రమే సంపూర్ణ అధికారం ఉంటుంది. అవసరమైతే మార్పులు చేర్పులు కూడా చేస్తారు. ఆశించిన నాణ్యత మేరకు నామినేషన్లు రాని పక్షంలో ఎంపికలను నిలిపివేసే అధికారం కూడా టూరిజంశాఖకు ఉంది. భువనగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చేదిద్దే లక్ష్యంతో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపిక చేసి రూ.100 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు అభివృద్ధి పనుల డీపీఆర్‌ను ఇంజనీర్ సంస్థ ఎల్అండ్‌టీ రూపొందిస్తోంది. అభివృద్ధి పనులను కూడా ఈ సంస్థనే నిర్వహించే అవకాశం ఉంది. డీపీఆర్‌లో భాగంగా ఖిల్లా అభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించే లక్ష్యంతో లోగో, ట్యాగ్ లైన్ పోటీలను నిర్వహిస్తోంది. త్వరలోనే మరిన్ని విభిన్న రకాల పోటీలు, ప్రజాభిప్రాయ సేకరణలు సదస్సులు నిర్వహించనున్నట్టు సమాచారం. లోగో డిజైన్, ట్యాగ్‌లైన్ నామినేషన్లను ఈ నెల 10లోపు dysoyadadri@gmail.com మెయిల్‌కు నామినేషన్లను పంపవచ్చు. పూర్తి వివరాలకు ఇదే వెబ్‌సైట్‌ను చూడాలని అధికారులు తెలిపారు.

‘ప్రజాపాలన’కు అపూర్వ స్పందన



సూర్యాపేటలో దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేటటౌన్, చివ్వెంల, జనవరి 5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ‘ప్రజాపాలన’కు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 13, 14, 29వ వార్డులతో పాటు చివ్వెంల మండల పరిధిలోని మున్యానాయక్‌తండాలో ఏర్పాటు చేసిన ‘ప్రజాపాలన’లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులను పరిశీలించి రశీదులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, చింతమల్ల రమేష్, కౌన్సిలర్లు కట్కూరి కార్తీక్‌రెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, అనంతుల యాదగిరిగౌడ్, మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, దశరథ, తస్వీర్, ఉపేంద్రారెడ్డి, పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ప్రజాపాలన కార్యక్రమంలో శుక్రవారం అధికారులు 40,369 దరఖాస్తులు తీసుకున్నారు. 33 పంచాయతీల్లో 29,753, జిల్లాలోని 13 మునిసిపల్ వార్డుల్లో నిర్వహించిన ‘ప్రజాపాలన’లో 10,616 దరఖాస్తులు అందాయి.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ‘ప్రజాపాలన’ దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	38,760	58,701
29	20,475	35,109	38,858	94,442
30	35,474	56,874	78,550	1,70,898
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	93,276	2,03,262
3	42,148	58,271	86,104	1,86,523
4	38,281	51,547	90,462	1,80,290
5	31,319	40,369	78,873	1,50,561
మొత్తం	2,17,862	3,21,932	5,04,883	10,44,677



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్


12లోగా ‘ప్రజాపాలన’

డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 5: ‘ప్రజాపాలన’లో ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తుల డేటా ఎంట్రీని ఈనెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పూర్తి సమాచారంతో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను ఆపరేటర్లు నమోదు చేయాలన్నారు. ఎంట్రీ పూర్తయిన అనంతరం సంబంధిత అధికారులు దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. జిల్లాలో డేటా ఎంట్రీ కోసం 489 మంది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు రూ.5 చెల్లిస్తామని తెలిపారు. డేటా ఎంట్రీ ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకటరెడ్డి, ఈడీఎం గఫార్, తదితరులు పాల్గొన్నారు.


పేటకు ‘స్వచ్ఛసర్వేక్షణ్’లో ఓడీఎఫ్ ప్లస్2



సూర్యాపేటటౌన్, జనవరి 5: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛసర్వేక్షణ్‌లో సూర్యాపేట మునిసిపాలిటీకి బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా ఓడీఎఫ్ ప్లస్2 గుర్తింపు లభించింది. పట్టణంలో పారిశుధ్య, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణలో భాగంగా నిర్వహించిన సర్వేలో గుర్తింపురావడం హర్షనీయమని మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జోరుగా క్యాంపు రాజకీయాలు

- నల్లగొండలో 8న అవిశ్వాసం, నేడు క్యాంపునకు కౌన్సిలర్లు
- మునిసిపాలిటీలపై కాంగ్రెస్ కన్ను
- కలిసి వచ్చిన అధికారం, బీఆర్‌ఎస్‌లో కుమ్ములాటలు





రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లోనూ పాగా వేసేందుకు కసరత్తులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఎంపీ ఎన్నికల్లో గంపగుత్తగా సీట్లు సాధించాలంటే మండల, గ్రామ స్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు కీలక పదవుల్లో ఉండాలనే యోచనలో కాంగ్రెస్ దిగ్గజాలు ఉన్నారు. ఈ మేరకు అవకాశం ఉన్న మునిసిపాలిటీలు, మండల పరిషత్తుల్లో అవిశ్వాస తీర్మానాలకు తెర లేపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలకు 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందడంతో మునిసిపాలిటీల్లో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 19 మునిసిపాలిటీలు ఉండగా, అందులో సగానికి పైగా మునిసిపాలిటీల్లో ప్రస్తుత మునిసిపల్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ సమాయత్తం అవుతోంది. కొంత మంది మునిసిపల్ చైర్మన్లు అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, మరి కొంత మంది మునిసిపల్ చైర్మన్లు తీర్మానాలు ప్రవేశపెట్టకముందే కాంగ్రెస్‌తో జత కట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

బీఆర్ఎస్‌కు తిరుగులేదని భావించిన చోట అంతర్గత కుమ్ములాటలతో సొంత పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్లపైనా అవిశ్వాసానికి కౌన్సిలర్లు రంగం సిద్ధంచేశారు. అవసరమైతే కాంగ్రెస్ కౌన్సిలర్లకు చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు సైతం వారు వెనకాడటం లేదు. విప్ పేరుతో బీఆర్ఎస్ నేతలు, చైర్మన్లు వారి చేయి దాటిన కౌన్సిలర్లను బెదిరించే ప్రయత్నం చేస్తుండగా, ఈ విషయంలో కలెక్టర్ల నివేదికే ఫైనల్. బీఆర్ఎస్ నేతలు పంపిన విప్ నోటీసులో పలు దోషాలు ఉన్నాయి. అధికార పార్టీ నేతలను కాదని, ఏ కలెక్టర్ నిర్ణయం తీసుకోరని కాంగ్రెస్ పెద్దలు వలస వచ్చిన కౌన్సిలర్లకు భరోసా ఇస్తున్నారు. అవిశ్వాసాలను ఆపేందుకు ప్రస్తుత చైర్మన్లు హైకోర్టు, విప్ అంటూ చివరి ప్రయత్నాలు చేస్తుండగా, వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునేందుకు ప్రభుత్వ ప్లీడర్లు, కలెక్టర్లు, మునిసిపల్ సీనియర్ అధికారులను కాంగ్రెస్ నేతలు సంప్రదించి అవిశ్వాస ప్రతిపాదన, నోటీసులు అన్నీ పకడ్బందీగా చేయిస్తున్నారు. పూర్తి బలం ఉన్నా, ముందుచూపుతో కొన్ని చోట్ల అవిశ్వాసానికి ముందు క్యాంపులకు కౌన్సిలర్లను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 8న నల్లగొండ మునిసిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ఉండగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లను శనివారం హైదరాబాద్‌కు క్యాంపునకు తరలించనున్నట్టు సమాచారం.

- నల్లగొండ మునిపిల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి సన్నిహితుడు. భూపాల్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఓట్ల తేడాతో కోమటిరెడ్డిపై ఓడిపోయారు. దీంతో కాంగ్రెస్ నల్లగొండ మునిసిపాలిటీని కైవసం చేసుకునే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఎన్నికల ముందే మునిసిపల్ వైస్ చైర్మన్‌తో పాటు మరో కొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ చైర్మన్‌ను తప్పించేందుకు కాంగ్రెస్ వేగంగా పావులు కదుపుతోంది. నల్లగొండలో మొత్తం 48 వార్డులు ఉండగా, తొలుత బీఆర్ఎస్‌కు 23, కాంగ్రెస్‌కు 18, ఎంఐఎంకు 1, బీజేపీకి 6 కౌన్సిలర్ స్థానాలు దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమీకరణలు మారడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎంఐఎం కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం ఆ పార్టీకి 34మంది కౌన్సిలర్ల బలం ఉంది. బీఆర్ఎస్ బలం 8 స్థానాలకు పడిపోయింది. కౌన్సిలర్ పిల్లి రామరాజును బీఆర్ఎస్ బహిష్కరించింది. బీజేపీలో ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు.
- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హాలియా, నందికొండ మునిసిపాలిటీలు ఉండగా వీటిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. హాలియాలో 12 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ మూడు స్థానాల్లో విజయం సాధించాయి. ఈ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కౌన్సిలర్లు యత్నించగా, స్థానికంగా ఉన్న వైశ్య సామాజికవర్గం ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని అవిశ్వాస ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలన్న సీనియర్‌నేత జానారెడ్డి సూచనతో ఇక్కడ బ్రేక్ పడింది. బీఆర్ఎస్ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కు మధ్య వైరం ఉండటం, తాజాగా చైర్మన్‌కు కలిసివచ్చింది.
- నందికొండ మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌లోని అసమ్మతి సభ్యులతో కలిసి కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. 2వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అనారోగ్యంతో మృతిచెందగా 11 మంది సభ్యులు ఉండగా, మారిన రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు 4, బీఆర్ఎస్‌కు ఏడుగురు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏకమయ్యారు.
- మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మునిసిపాలిటీని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇక్కడ 10 వార్డులకు కాంగ్రెస్ ఆరు, బీఆర్ఎస్ మూడు, బీజేపీ ఒకటి చొప్పున దక్కించుకున్నాయి. కాంగ్రెస్ నుంచి చైర్మన్ అయిన చంద్రకళ ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి అవిశ్వాసం ద్వారా ఈ మునిసిపాలిటీని కాంగ్రెస్ సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.
- సూర్యాపేట జిల్లాలోని కోదాడలో చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. మొత్తం 35 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 25, కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాలు కలిసి 10 స్థానాల్లో విజయం సాధించారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందునుంచి ఇప్పటి వరకు 15 మంది వరకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం అధికార పార్టీకి 25 మంది కౌన్సిలర్లు ఉండడంతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈనెల 20న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుంది.
- నేరేడుచర్లలో మొత్తం 15వార్డులకు కాంగ్రెస్ ఏడు, బీఆర్ఎస్ ఏడు, బీజేపీ ఒక స్థానం దక్కించుకున్నాయి. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడి ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులను వినియోగించుకున్నారు. తాజాగా, బీఆర్ఎస్ వైస్ చైర్మన్ శ్రీలతారెడ్డి రాజీనామా చేసి బీజేపీలో చేరి హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగి ఓడిపోయారు. మారిన సమీకరణలతో బీఆర్ఎస్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ బలం 12కు చేరింది.
- హుజూర్‌నగర్‌లోనూ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం కాగా, ఆమె కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. 28 వార్డులకు ప్రస్తుతం కాంగ్రెస్ బలం 18కి చేరింది.
- దేవరకొండ, చిట్యాల, హుజూర్‌నగర్, యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో చైర్మన్లుగా ఎన్నికైన వారు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం వారిపై అవిశ్వాసం లేనట్టే. నకిరేకల్ మునిసిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఇంకా ఏడాది సమయం ఉంది.

భువనగిరిలో 23న అవిశ్వాస తీర్మాన సమావేశం

యాదాద్రి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): భువనగిరి మునిసిపాలిటీలో రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. ప్రస్తుత మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై సొంతపార్టీకి చెందిన కౌన్సిలర్లతోపాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గత నెల 30న కలెక్టర్‌కు 31మంది కౌన్సిలర్లు వారి సంతకాలతో అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారు. ఈ మేరకు 23న ఉదయం 11గంటలకు అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ నోటీసులు జారీచేశారు. మునిసిపాలిటీలో మొత్తం 35మంది కౌన్సిలర్లు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి 24మంది కౌన్సిలర్లు హాజరైతే కోరం సరిపోతుంది. సమావేశాన్ని, ఎన్నికను నిర్వహించేందుకు ఎన్నికల అధికారిగా ఆర్డీవో లేదా జిల్లాస్థాయి అధికారిని కలెక్టర్ నియమించే అవకాశం ఉంది. కోరం లేకుంటే సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేస్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానాన్ని ఫిబ్రవరి 2023న అప్పటి కలెక్టర్‌కు కౌన్సిలర్లు విన్నవించారు. పలు రాజకీయ పరిణామాల దృష్ట్యా నోటీసులు జారీ కాలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడటంతో మరోసారి మునిసిపాలిటీలో అవిశ్వాసం తెరపైకి వచ్చింది. గతంలో కేవలం 19మంది కౌన్సిలర్లు మాత్రమే సంతకాలు చేసి అవిశ్వాసం కోరగా, తాజాగా 31మంది కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు విన్నవించడం గమనార్హం. మరోవైపు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ఆశావహులు జోరుగా కౌన్సిలర్లతో చర్చలు ప్రారంభించారు.



భువనగిరి మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిప్రతం ఇస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

మతిస్థిమితం లేని మహిళ హత్యకేసులో

జీవితఖైదు శిక్ష, జరిమానా


శిక్షకు గురైన నేరస్థుడు మహ్మద్ అన్వర్

భూదాన్‌పోచంపల్లి, జనవరి 5: మతిస్థిమితం లేని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనలో నేరస్థుడిగా రుజువైన వ్యక్తికి జీవిత ఖైదు శిక్షతో పాటు, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. చౌటుప్పల్ రూరల్ సీఐ ఎం.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో 2023 జూన్ 13వ తేదీ రాత్రి వైన్‌షాప్ ఎదురుగా బిల్డింగ్ సెల్లార్‌లో మతిస్థిమితం లేని మహిళ అనుమానాస్పద మృతి ఘటనపై 2023 జూన్ 14వ తేదీ పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు 121/2023, యూ/ఎస్: 376, 302 ఐపీసీ నమోదు చేశారు. శాస్త్ర సాంకేతిక ఆధారాలతో పరిశోధన ప్రారంభించి నేరస్థుడిని పట్టుకొని, విచారణ జరిపారు. పరిశోధనలో నేరస్థుడు సదరు మహిళను అత్యాచారం చేసి, బండరాయికి తలను మోది హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నేరస్థుడిని 2023 జూన్ 16వ తేదీన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య ఆధ్వర్యంలో పరిశోధన అధికారి చౌటుప్పల్ సీఐ మహేష్, పోచంపల్లి ఎస్‌ఐ విక్రం రెడ్డి తమ సిబ్బందితో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బాధితురాలు(55) చిన్నరావిరాల గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళగా గుర్తించారు. మహ్మద్ అన్వర్ (34) అనే నిందితుడు బీహార్ రాష్ట్రం, ముజఫర్ జిల్లా ఉర్హాని పీఎస్ పరిధిలోని దోధి రథన్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అధికారులు ఈ కేసుకు శాస్త్ర సాంకేతిక ఆధారాలు, సరైన సాక్ష్యాధారాలతో పరిశోధన ముగించి తుది నివేదికను 2023 సెప్టెంబరు 8వ తేదీన కోర్టుకు అందజేశారు. ఈ కేసును ఫస్ట్ ఏడీజే ఫాస్ట్ ట్రాక్ భువనగిరి కోర్టులో ట్రయల్ జరిపించగా అడిషనల్ పీపీ దామోదర్‌రెడ్డి పోలీస్ వారి తరుపున వాదించారు. ఈ విచారణలో నేరస్థుడికి జీవిత ఖైదు కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 2వేలు జరిమానా విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చిందని సీఐ మహేష్ తెలిపారు.

గంధమల్ల రిజర్వాయర్ ఉన్నట్లా..లేనట్లా?


గంధమల్ల గ్రామంలోని గంధమల్ల చెరువు

- సర్వే పనులకే పరిమితం
- 2019 ఫిబ్రవరిలో భూసేకరణ నోటిఫికేషన్
- మొదట 9.8టీఎంసీలుగా తర్వాత 4.2టీఎంసీలుగా ప్రతిపాదనలు
- ఇప్పటివరకు రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టత కరువు
- ఆందోళనలో ముంపు నిర్వాసితులు, రైతులు

యాదాద్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వద్ద ప్రతిపాదించిన గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం ఉన్నట్లా..? లేనట్లా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ముంపు నిర్వాసితులు, రైతులు అయోమయంలో పడ్డారు. అసలు ఈ ప్రాజెక్టు స్వరూపంపైనా ఇప్పటివరకు ఎవరికీ కూడా స్పష్టత లేదు. రిజర్వాయర్ నిర్మాణంతో ఎన్ని ఎకరాల భూమి కోల్పోతుంది? ఎన్ని టీఎంసీల సామర్థ్యం? ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు భూసేకరణ? అనే అంశాలపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో భూనిర్వాసితులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారికంగా ఈ రిజర్వాయర్ పనులు ఇప్పటికీ సర్వే దశలోనే ఉన్నట్టుగా చూపుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసి చేతులు దులుపుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావంతో ఉన్నారు. సముద్రమట్టానికి అత్యంత ఎత్తైన ప్రాంతంగా, నదీజలాల సదుపాయం లేని కరువు నేలగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాల మళ్లింపునకు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు 14, 15,16 ప్యాకేజీల కింద పనులను ప్రారంభించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే 14, 15వ ప్యాకేజీలో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల వద్ద రిజర్వాయర్ నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించింది. ఎత్తిపోతల లింక్ ప్రాజెక్టులో చివరి(టెయిల్‌ఎండ్)లో గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లను ప్రతిపాదించారు.

హద్దురాళ్లు వేసి..

ప్రభుత్వం పూర్తి స్థాయి సర్వేకు ఆదేశించడంతో రిజర్వాయర్ నిర్మాణంతో కోల్పోతున్న భూముల్లో ప్రాజెక్టుకు సంబంధించిన హద్దురాళ్లను కూడా ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు సర్వేతోనే సరిపోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వాయర్ నిర్మాణంపై 2019 ఫిబ్రవరిలో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. 232ఎకరాల అటవీ భూమిని సేకరించింది. ఇప్పటివరకు ఈ పనులపై అతిగతీలేదు. ఈ రిజర్వాయర్‌ను మొదటగా 9.8టీఎంసీలుగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా 2,450 క్యూసెక్కుల నీరు గంధమల్ల జలాశయానికి చేరేలా ప్రణాళికను రూపొందించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా 6,467ఎకరాలు, ప్రధాన ఎడమకాల్వ(ఎల్ఎంసీ)ద్వారా 37,814ఎకరాలు, కుడికాల్వ(ఆర్ఎంసీ)ద్వారా 19,901 ఎకరాలు సాగునీరు అందించేందుకు అంచనాలు రూపొందించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో గంధమల్ల, బచ్చలగూడెం, ఇందిరానగర్ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతుండగా వీరారెడ్డిపల్లిలో దాదాపుగా 1800ఎకరాలు వరకు భూములు కోల్పోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, ఆలేరు, బీబీనగర్, యాదగిరిగుట్ట, ఆత్మకూరు మండలాలకు సాగునీరు అందనుంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి నిర్మాణాలపై సమీక్షలు నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టుపై ఏదో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని ముంపు నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు.

కరువు నేలకు గంధమల్లతోనే పరిష్కారం



కరువు నేలకు గంధమల్లతోనే శాశ్వత పరిష్కారం. బంగారు పంటలు పండాల్సిన పంట భూములు సాగునీరు లేక బీళ్లుగా మారాయి. కరువును శాశ్వతంగా దూరం చేయాలంటే గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణమే శరణ్యం. గంధమల్లతో రాజాపేట మండలంతో పాటు ఏడు మండలాల పరిధిలోని భూములు సస్యశ్యామలం అవుతాయి.

\- వీరారెడ్డి సర్పంచ్, చల్లూరు, రాజాపేట మండలం

రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాలి



సాగు, తాగునీరు గంధమల్ల రిజర్వాయర్‌తోనే సాధ్యం. వేల ఎకరాలు సాగు నీరు లేక పడావు పడి కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. సాగు, తాగునీరు అందించేందుకు గంధమల్ల ప్రాజెక్టు ఎన్నో ఏళ్లుగా ఎన్నికల హామీగానే మిగిలింది. రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించి పూర్తి చేయాలి. రైతులు, ముంపు బాధితులకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉంది.

\- భిక్షపతిగౌడ్, మాజీ జడ్పీటీసీ, రాజాపేట మండలం

4.2టీఎంసీలుగా ప్రతిపాదనలు

గంధమల్ల రిజర్వాయర్‌ను మొదటగా 9.8 టీఎంసీలుగా నిర్మించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అయితే 4.2టీఎంసీలకు తగ్గిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించి ఈమేరకు ప్రతిపాదనలు రూపొందించింది. నిర్మాణ పనులు కాంట్రాక్టర్ అప్పగించినా ఇప్పటివరకు ఎలాంటి పనులు కూడా మొదలు పెట్టలేదు. కాళేశ్వరం 14, 15,ప్యాకేజీలో ఈ రిజర్వాయర్ నిర్మాణం చేపడుతారా? లేదా అన్నది ఇరిగేషన్ శాఖ అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేదు. ప్రభుత్వ వెబ్‌సైట్ ఇంటిగ్రేటేడ్ ల్యాండ్ రికార్డ్సు మేనేజ్‌మెంట్ సిస్టం(ఐఎల్ఆర్ఎంఎస్) నుంచి ముంపు భూమి సర్వే నెంబర్లను తొలగించారు. భూసేకరణ జరగలేదని, పరిహారం లెక్క తేలలేదని, సర్వే నెంబర్ల తొలగించారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుపై స్పష్టత లేకపోవడంతో ముంపు గ్రామాల్లో కొత్త ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నారు. బోర్లు వేయాలన్నా ఆలోచిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టతనిస్తుందని గ్రామస్థులు, రైతులు ఆశాభావంతో ఉన్నారు.

13 కిలోమీటర్ల దూరం..

ఐదు నిమిషాల్లో ఔషధాలు

- వైద్యానికి సాంకేతికత తోడు
- అత్యవసర సేవలకు డ్రోన్
- పీహెచ్‌సీల నుంచి శ్యాంపిల్స్, మందుల పంపిణీకి చర్యలు

యాదాద్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోగులకు అత్యవసరంగా పరీక్షలు చేయాలన్నా...మందులు కావాలన్నా సంబంధిత ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ పెరుగుతుండటంతో, వైద్య రంగానికి సాంకేతికతను తోడు చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అత్యవసర సేవలందించేందుకు ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి రోగులకు సంబంధించిన శ్యాంపిల్స్, మందుల పంపిణీ ఇక నుంచి డ్రోన్‌ల ద్వారా సరఫరా చేసేందుకు ఓ ఔత్సాహిక బృందం ట్రయల్‌రన్ చేపట్టింది. రోగులకు అత్యవసర సేవలందించేందుకు యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపడుతోంది. ఆస్పత్రుల్లోని రోగుల నుంచి సేకరించిన పలు శాంపిళ్లను వేగంగా ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయడంతోపాటు మందులను తరలించేందుకు డ్రోన్ సేవలను వినియోగించనుంది. ఈ మేరకు గత మూడురోజులుగా భువనగిరి, బీబీనగర్ మండలాల పరిధిలోని పీహెచ్‌సీల నుంచి ట్రయల్‌రన్ నిర్వహించింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎయిమ్స్ నుంచి భువనగిరి మండలం బొల్లేపల్లి పీహెచ్‌సీకి, అక్కడ నుంచి భువనగిరి ఆసుపత్రికి 25కిలోల బరువు ఉన్న మందులను డ్రోన్ ద్వారా సరఫరా చేశారు. ఎయిమ్స్ నుంచి భువనగిరికి 13కిలోమీటర్లు ఉంటుంది. డ్రోన్ ద్వారా మందుల పంపిణీకి కేవలం 5నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. బీబీనగర్ మండలం కొండమడుగు, బొమ్మలరామారం మండలం కేంద్రంలోని పీహెచ్‌సీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఆసుపత్రుల్లో క్షయతోపాటు ఇతర రోగులకు సంబంధించిన శ్యాంపిల్స్‌ను డ్రోన్ ద్వారా భువనగిరి ఏరియా ఆస్పత్రిలోని ల్యాబ్‌కు పంపించి, పరీక్షలు చేపట్టి.. పరీక్షల వివరాలతో పాటు మందులను కూడా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ ట్రయల్ రన్ విజయవంతం అయిన పక్షంలో మందుల సరఫరాకు వైద్య ఆరోగ్యశాఖ, ఎయిమ్స్ ఒప్పందం కుదుర్చుకోనుంది. ఎయిమ్స్ పరిసరాల్లోని ఆస్పత్రులకు అత్యవసరంగా రోగులకు సంబంధించి పలు పరీక్షల శాంపిళ్లు, మందుల సరఫరాకు కేవలం 10నిమిషాలలోపే సమయం పడుతుందని ట్రయల్‌రన్‌లో తేలింది. కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే డ్రోన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.


బీబీనగర్‌లోని ఎయిమ్స్ వద్ద డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఔత్సాహిక బృందం సభ్యులు

విద్యుత్ మోటర్ల కేబుల్ దొంగల ముఠా అరెస్ట్

రెండు బైక్‌లు, ఒక ఆటో సీజ్, రూ.6.75 లక్షలు స్వాధీనం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

గరిడేపల్లి, జనవరి 5: నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని తూముల వద్ద బేరింగ్‌లు, వ్యవసాయ విద్యుత్ మోటర్లు దొంగిలిస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఎర్రకుంట, కొత్తగూడెం, ఖుతుబ్‌షాపురం, లచ్యాతండ, కపూర్యతండ, గడ్డిపల్లి, అప్పన్నపేట గ్రామాల్లో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్లు, కేబుల్ వైర్లను చోరీచేయడంపై ఫిర్యాదులు అందాయన్నారు. కాల్వలకు ఉండే తూములకు బిగించిన పెద్ద బేరింగ్‌లను కూడా దొంగిలించి విక్రయిస్తుండటంతో రైతులు ఇచ్చిన సమాచారం మేరకు ముఠా సభ్యులను పట్టుకున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలోని తిరుమలగిరి మండలం నేతాపురానికి చెందిన పసుపులేటి రాంబాబు, బుర్రి బంగారు, తన్నీరు నర్సింహ, తన్నీరు అంజి, పొదిల నవీన్, నిడమనూరు మండల కుంటిగొర్ల గ్రామానికి చెందిన సంద్రాల అశోక్, సంద్రాల సైదులు, మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూరు గ్రామానికి చెందిన అవిరెండ్ల రిత్విక్ ముఠాగా ఏర్పడి సాగర్ ఎడమకాల్వ పరిధిలో మిర్యాలగూడ, మునగాల, గరిడేపల్లి ఖమ్మం, ముదిగొండ ప్రాంతాల్లో ఈ ముఠా సంచరిస్తూ గత కొద్ది రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల 23 ప్రాంతాల్లో తూములకు సంబంధించిన బేరింగ్‌లు, వ్యవసాయ మోటర్లలోని కాపర్ తీగను దొంగిలించారన్నారు. వీరు దొంగిలించిన మోటర్లలోని కాపర్ వైరు, బేరింగ్‌లను వేములపల్లి, కేశరాజుపల్లి గ్రామాల్లోని వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ముఠాలో ఎనిమిది మంది ఉండగా ఐదుగురిని అరెస్టు చేశామని, వారినుంచి నుంచి కాపర్ తీగ, బేరింగ్‌లను కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులను కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.6.75లక్షల నగదు, రెండు బైక్‌లు, ఐదు కిలోల రాగి తీగ, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ముఠా సభ్యులు ముగ్గురు పొదిల నవీన్, సంబరాల సైదులు, తన్నీరు అంజి పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ


యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజలు ఆరంభించి గర్భగుడిలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. ప్రధానాలయ ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో తిరుప్పావై పర్వాలు వైభవంగా కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవను ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనృసింహుడి సన్నిధిలో స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా రూ.17,05,722 ఆదాయం ఆలయ ఖజానాకు సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

యాదగిరీశుడి సేవలో మాజీ గవర్నర్ నరసింహన్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని మాజీ గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు అర్చకబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ముఖమండపంలోని ధ్వజస్తంభాన్ని దర్శించుకుని గర్భాలయంలో స్వయంభువుల చెంత ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పూజల అనంతరం ప్రధానాలయ ముఖమండపంలో అర్చకులు, వేద పండితులు ఆయనకు చతుర్వేద ఆశీర్వచనం నిర్వహించారు. దేవస్థాన ఈవో రామకృష్ణారావు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

మట్టపల్లిలో వైభవంగా నృసింహుడి కల్యాణం

మఠంపల్లి, జనవరి 5: సూర్యాపేట జిల్లా మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యశాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టంతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లి రావు అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహామూర్తి, లక్ష్మీనరసింహామూర్తి,సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, రాజష్, రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి

మూడు గొర్రెలకు తీవ్ర గాయాలు

భువనగిరి రూరల్, జనవరి 5: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నందనం శివారులో కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 3 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెల్జూరి మల్లేష్ గొర్రెల మంద వద్ద గొర్రెలను సంరక్షిస్తుండగా కుక్కలు వాటిపై దాడి చేయడంతో 5 గొర్రెలు మృతి చెందాయి. మరో 3 గొర్రెలు గాయపడ్డాయి.

దాదాపు రూ.25 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నా డు. నందనం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన బాధితుడికి పరిహారం అందజేయాలని మాజీ సర్పంచ్ నాగెల్లి మాధవి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

‘ప్రజాపాలన’తో ప్రజా సమస్యల పరిష్కారం

▸▸ ప్రజాపాలనకు ప్రజా స్పందన బాగుంది ▸▸ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



దరఖాస్తులను స్వీకరిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామెదర్ రెడ్డి

ఆత్మకూర్(ఎస్)/పెన్‌పహాడ్, జనవరి 5 : ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బోట్యా తండా, కోటినాయక్ తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలందరూ దరఖాస్తు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు వెంకట్‌రెడ్డి, నాగేంద్ర శర్మ, ఎంపీడీవో మల్సూర్‌నాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఏవో దివ్య, సంజీవ, రవికుమార్, ప్రసాద్,సర్పంచ్ మంగమ్మ, మంగ్యా లింగనాయ క్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ మండల నాయకులు కందాళ వెంకట్‌రెడ్డి, జాటోతు రాజేష్, సుధాకర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. పెన్‌పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీడీవో బాణాల శ్రీనివాస్, సర్పంచ్ రావిరాల శోభారాణి, మాజీ ఎంపీటీసీ తూముల సురేష్‌రావు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏవో కృష్ణ సందీప్, ఏపీవో రవి పాల్గొన్నారు. మండలంలోని మురసకుంటతండా, మాచారం, గాజులమల్కాపురం, చెట్ల ముకుందాపురం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు స్వప్న, మట్టయ్య, సర్పంచ్‌లు సైదమ్మ, వెంకన్న, శోభరాణి, ధనమ్మ, ఎంపీటీసీలు నాగునాయక్, జ్యోతి, వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు , అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

మఠంపల్లి, జనవరి 5: ప్రజా పాలన గ్రామసభలు శుక్రవారం మండలంలోని భీమ్లాతండా, రామచంద్రాపురం, మట్టపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఏడీఏ సంధ్యారాణి, తహసీల్దార్ మంగారాథోడ్, ఎంపీడీవో మామిడి జానకిరాములు, ఎంపీవో అంజానేయులు, డీటీ సత్యానారాయణ, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడటౌన్, జనవరి 5: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 34వ వార్డు కౌన్సిలర్ గంధం యాదగిరి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా వార్డు వాసుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, రమేష్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, గుండెపంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం



దరఖాస్తులు తీసుకుంటున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 5 : ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం 27వ వార్డులో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. వేపలసింగారంలో ఎంపీపీ శ్రీనివాస్ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో లావణ్య, శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, కార్యదర్శి నాగమణి, కౌన్సిలర్ గురవయ్యగౌడ్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మోతె, జనవరి 5 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని మండల ప్రత్యేకాధికారి తిరుపతయ్య, మాదవరెడ్డి అన్నారు. శుక్రవారం మోతె, హుస్సేనాబాద, కొత్తగూడెం, తుమ్మలపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తుదారులు పూర్తిస్థాయి సమాచారంతో దరఖాస్తు చేసి రశీదు పొందాలన్నారు. నూతన రేషన్ కార్డులతో పాటు ఆరు గ్యారెంటీలకు సబంంధించిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రకాశ్ రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో హరిసింగ్ నాయక్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



దరఖాస్తు తీసుకుంటున్న అధికారి తిరుపతయ్య

పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



అర్వపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అందిస్తూ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభయహస్తం కింద ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలతో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సుయాదవ్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, దరూరి యోగనందచార్యులు, పీడీ కిరణ్‌కుమార్, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, ఏడీఏ రామారావునాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ పాల్లెలి సురేష్, ఇందూర్తి వెంకట్‌రెడ్డి, రత్నం లక్ష్మాజీ, మీలా కృష్ణయ్య, జీడి వీరస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్ అభ్యర్థి ఎంపికపై
మల్లగుల్లాలు

▸▸ నేనంటే నేనే అంటున్న కౌన్సిలర్లు ▸▸ అభ్యర్థి ఎంపిక తరువాతే అవిశ్వాసం తేదీ ప్రకటన



హుజూర్‌నగర్, జనవరి 5: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో కొత్త వైస్ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిపారు. గురు, శుక్రవారాల్లో పట్టణంలోని రైస్‌మిల్లర్స్ కార్యాలయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొని వైస్ చైర్మన్‌గా రేసులో తామూ ఉంటానని ఎనిమిది మంది కౌన్సిలర్లు పోటీ పడినట్లు తెలిసింది. దీంతో వైస్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక రసవత్తరంగా మారింది. ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్ నుంచి ఏడుగురు గెలవగా బీఆర్ఎస్ నుంచి 20 మంది, సీపీఎం నుంచి ఒకరు గెలిచారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 20 మందిలో 10మంది కాంగ్రెస్‌లో చేరడంతో ఇక 10 మంది బీఆర్ఎస్‌లో ఉన్నారు. వారిలో మరో నలుగురు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కోసం ఎనిమిది మంది పోటీ పడుతున్నారు. సామాజిక వర్గాల వారీగా పదవిని కేటాయించాలని పలువురు కౌన్సిలర్లు భేటీలో కోరినట్లు తెలిసింది. వైస్ చైర్మన్ రేసులో కోతి సంపత్‌రెడ్డి, కస్తాల శ్రావణ్, కారింగుల వెంకటేశ్వర్లు, జక్కుల శంభయ్య, ఓరుగంటి నాగేశ్వరరావు, అమరబోయిన సతీష్, రాజానాయక్, బొల్లెద్దు ధనమ్మలు పోటీపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుత చైర్మన్ మహిళ ఉండగా వైస్ చైర్మన్‌ను సామాజిక వర్గాల ప్రామాణికంగా ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. 28మంది కౌన్సిలర్లలో ఇప్పుడు బీఆర్ఎస్‌లో 10మంది ఉండగా కాంగ్రెస్‌కు పూర్తి మెజార్టీ 17 మంది ఉండటంతో పాటు సీపీఎం కౌన్సిలర్ కూడా అవిశ్వాసానికి మద్దతు ప్రకటించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి పండుగ అనంతరం అవిశ్వాసంతో పాటు నూతన వైస్ చైర్మన్ ఎన్నిక కూడా జరిగే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు పేర్కొంటునారు.

ఏకాభిప్రాయంతో మంత్రికి నివేదిక!

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ బి ఫారం మీద గెలిచిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న పలువురు కోరినట్లు తెలిసింది. దీంతో పాటు గత రెండేళ్ల క్రితం కాంగ్రెస్‌లో చేరినవారు ఎన్నికల ముందు చేరిన వారు, ఎన్నికల తరువాత చేరినవారు కూడా తమకు అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత, కొత్త కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన వారందరూ ఏకాభిప్రాయంతో ఒకేపేరు సూచించి మంత్రి ఉత్తమ్‌కు నివేదిక ఇచ్చేందుకు కౌన్సిలర్లు శుక్రవారం రాత్రి మరోదఫా చర్చలు జరిపినట్లు తెలిసింది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికా లేక కాంగ్రెస్ బీఫామ్‌పై గెలిచిన కౌన్సిలర్లకు ఎవరికి వైస్ చైర్మన్ పదవి వరిస్తుందోన్న ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం రసవత్తరంగా మారింది.

అంతర పంటల సేద్యంతో అధిక లాభాలు

పెన్‌పహాడ్, జనవరి 5: అంతర పంటల సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చని నాబార్డు బ్యాంకు డీడీఎం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం, మాచారం గ్రామాల్లో సాగు చేసిన మిర్చి, టమాట, పామాయిల్, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీకృత వ్యవసాయానికి స్థిరమైన ఆదాయం రావడాటానికి ఆయిల్‌పాం తోటలు మేలు అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఉద్యాన శాఖ అధికారి జగన్, ఏవో కృష్ణ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు నరసింహ, అనిల్, గణేష్, మల్లేష్, ఫీల్డ్‌అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడి పాల్గొన్నారు.

వానాకాలం నాటికి అందుబాటులోకి ఎత్తిపోతల

మఠంపల్లి, జనవరి 5:వచ్చే వానాకాలం సీజన్ నాటికి కృష్ణానదిపై ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెస్తామని ఐడీసీ డీఈ బిక్షం అన్నారు. మండలంలోని చౌటపల్లి, ఎర్రగట్టు ఎత్తిపోతల పథకాలను శుక్రవారం స్థానిక నాయకులు, రైతులతో కలిసి ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎత్తిపోతల నిర్వహణకు కావలిసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీసీ ఏఈ శ్రీనివాసరావు, నాయకులు వెన్న భద్రారెడ్డి, చింతల వెంకటనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం

మేళ్లచెర్వు/మఠంపల్లి, జనవరి 5: మేళ్లచెర్వు గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో డీఎల్‌పీవో సాంబిరెడ్డి శుక్రవారం విచారణ నిర్వహించారు. సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, నిధులు దుర్వినియోగమయ్యాయని వార్డుమెంబర్లు, స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై డీఎల్‌పీవో సాం బిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామన్నారు. తనిఖీల్లో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, జిల్లా ఆడిటర్ సందీప్ పాల్గొన్నారు. మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ రికార్డులను డీఎల్‌పీవో జానకిరాములు, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో జానకిరాములు, ఎంపీవో ఆంజనేయులు స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేటఅర్బన్,జనవరి 5: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ రవి, పట్టణ ఎస్.ఐ రవిందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పాండునాయక్, ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ యాదయ్య, యల్లయ్య. గోపయ్య, చారి, నాగార్జున, పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే సామేల్



మద్దిరాల మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

మద్దిరాల, జనవరి 5: అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మద్దిరాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పేదలకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను వారికి అందేలా చూడాలన్నారు. ఏ ఒక్క నిరుపేదకు అన్యాయం జరగవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జడ్పీటీసీ కన్న సురాంబవీరన్న, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సరోజ, ఎంపీవో రాజేష్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నూతన్‌కల్, జనవరి 5: ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అబివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో ప్రజలందరూ అబివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాళ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ఇందిర, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మూసీ వాగు వరకు పైపులైన్

అర్వపల్లి, జనవరి 5: మూసీ ఎగువ నుంచి వచ్చే వరదతో పొలాలు మునిగిపోకుండా ఎంత ఖర్చు అయినా మూసీ వాగు వరకు పైపులైన్ వేయాలని ఎమ్మెల్యే సామేల్ తెలిపారు.రూ.1.90లక్షల వ్యయంతో గూనలు ఏర్పాటుచేసే ప్రదేశాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పూర్తిగా నీటిని తొలగించి దళిత రైతులకు సేద్యం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 80శాతం మురుగు నీరు మూసీ వాగులోకి తరలించామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. పూర్తిగా నీటిని తొలగించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. దీంతో భూములున్న రైతులు సంతోషం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సింగ్ నాగమ్మ శ్రీనివాస్‌గౌడ్, బైరబోయిన మహరాజు, మోరపాక సత్యం, సిగ నసీర్‌గౌడ్, రింగు బాలయ్య, కృష్ణమూ ర్తి, జలేందర్, సోమయ్య, రాంమూర్తి పాల్గొన్నారు.

‘జీఎస్టీ పేరిట దోచేశారు’

● దళితబంధు లబ్ధిదారుల నిరసన

తిరుమలగిరి, జనవరి 5: ‘దళితబంధు’ పథకంలో దళితులకు రావల్సిన మొత్తం డబ్బులను రాకుండా జీఎస్టీ పేరిట కాజేసిన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ‘దళితబంధు’ పథకంలో తాము దరఖాస్తు చేసుకున్న యూనిట్లకు 3నుండి 4లక్షలు కాజేసి మోసం చేశారన్నారు. అడిగితే తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులు ఎమ్మెల్యే సామేల్‌కు ఫోన్ చేయగా, నియోజకవర్గంలో దళితబంధు పథకంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తానని, ఆందోళన చెందవద్దని హామీ ఇవ్వటంతో నిరసన విరమించారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

కోదాడ రూరల్, జనవరి 5 : ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులైన పేదలకు కచ్చితంగా అందించాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు ముత్యాలు డిమాండ్ చేశారు. శుక్రవారం 23వ వార్డులో ప్రజాపాలన గ్రామసభ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలకు అందేవరకు సీపీఎం ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, కృష్ణ, నవీన్, మరియన్న, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యాన్ని పెంపొందించాలి

నేరేడుచర్ల, జనవరి 5: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయ సమావేశాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. పాఠశాల స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు, పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయ కరదీపిక అభ్యసన పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాలలో ఎస్ఎల్ఎన్ కార్యక్రమ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఓ సత్యనారాయణరెడ్డి, ఆర్పీలు షఫి, శ్రీధర్, సీఆర్పీ పద్మ, కాంప్లెక్స్ పరిధి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడిగా రాజయ్యమాదిగ

సూర్యాపేటఅర్బన్, జనవరి 5: మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా యాతాకుల రాజయ్య మాదిగ ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రాం భవనంలో జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్బంగ రాజయ్యమాదిగ మాట్లాడుతూ మాదిగల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలనే లక్ష్యంగా ఎంఎస్‌పీ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. నాఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా ఏపూరి రాజుమాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడిగా పాల్వాయి బాలయ్యమాదిగ, సిద్దెల శ్రీనుమాదిగ, ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి అంజయ్యమాదిగ, దాసరి వెంకన్నమాదిగ, కార్యదర్శులు పుట్టల మల్లేష్, కందుకూరి శ్రీనివాస్, బచ్చలకూరి ప్రసాద్, బొడ్డు కుటుంబరావు, ప్రచార కార్యదర్శులు బైద వెంకన్న, పాలెపాక అంజయ్య, ఏడవెల్లి చంద్రయ్య, కస్తల వెంకటేశ్వర్లు, నకిరేకంటి రవి, సహాయ కార్యదర్శి సిద్దల వెంకటి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ తూరుగంటి అంజయ్య, గుద్దెటి యల్లయ్యమాదిగ, ములకలపల్లిరవి, చింత వినయ్‌మాదిగ, మారెపల్లి సావిత్రి, పిడమర్తి నాగేశ్వరి, బోడ శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బొజ్జ సైదులు, గారకనకయ్య, సిరపంగి లింగస్వామి, మాదాసు గోపి, శ్రీనివాస్, బొడ్డు విజయ్, ములుగూరి రాజు, ఆంజనేయులు, ఏపూరిరాజు, బొజ్జ వెంకన్న, మేడి కృష్ణ, తాటిపంగుల నవీన్, చెరుకుపల్లి సతీష్, కిరణ్, వెంకన్న పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ
బాలబాలికల జట్లు ఎంపిక

హుజూర్‌నగర్, జనవరి 5 : హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ బాలబాలికల పోటీల జట్లను ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 14 వరకు సిద్ధిపేటలో నిర్వహించనున్న 49వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. 20సంవత్సరాలలోపు బాలబాలికలను జిల్లా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2004 ఫిబ్రవరి 5వ తేదీ తర్వాత జన్మించిన వారికి అర్హత ఉంటుందన్నారు. బాలురు 70 కిలోల లోపు, బాలికలు 65కిలోల లోపు ఉండేవారిని ఎంపిక చేస్తామన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనాలనే ఉత్సాహం ఉన్న యువతీయువకులు ఈ నెల 7న హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం...

పాలకవీడు, జనవరి5: యరగొర్ల సైదులు యాదవ్ సహకారంతో జాన్‌పహాడ్ దర్గా సఫాయి బావి పూడికతీత చేపట్టి పూర్తిచేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ బావిలో నీరులేక చెత్తాచెదారంతో నిండి ఉందని భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తన వంతు సహాయంగా రూ. లక్ష వ్యయంతో పూడికతీత పనులు చేపట్టానన్నారు.

అర్వపల్లి, జనవరి 5: తెలంగాణ స్టేట్ ఐక్య టీచర్స్ ఫెడరేషన్ జాజిరెడ్డిగూడెం మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా కాకి సీనయ్య ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు సోంబాబు అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా నోముల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చోలేటి వెంకటేశ్వర్లు, మహిళ ఉపాధ్యక్షురాలిగా విజిత, కమిటీ సభ్యులుగా లింగస్వామి, అశోక్, వెంకన్నను ఎన్నుకున్నారు.

మద్దిరాల, జనవరి 5: క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని సర్పంచ్ బరపటి ఉపేందర్ అన్నారు. రెడ్డిగూడెం గ్రామంలో గుండాల లింగయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ క్రీడలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గుండాల సుమన్, గుండాల మహేష్ పాల్గొన్నారు.

మద్దిరాల, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా నేత జగన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలను ఆయన కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బిక్షం, వెంకన్న, భూక్య రవి, వాసు, మల్సూర్, షేక్ ఖాశీం, రవి, పోతుగంటి శ్రీను పాల్గొన్నారు.

మునగాల రూరల్, జనవరి 5: ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌ల సహకారంతో గీత కార్మికుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. ఆకుపాములలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ లేని గీతకార్మికులందరికీ లైసెన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వీరేందర్, సైదులు, బాబు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సైదులు, రమేష్, వీరబాబు, పాల్గొన్నారు.

వెలిశాల(తిరుమలగిరి రూరల్), జనవరి 5: తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని అమ్మా-నాన్న సేవా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పేరాల ఎల్లయ్య, లక్ష్మయ్య కోరారు. ప్రతి సంవత్సరం 500మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులైనా ఆర్థిక కారణాలతో ఇంటర్ చదవలేకపోతున్నారన్నారు. చదువు మధ్యలోనే మానివేస్తున్నందున ప్రభుత్వ కళాశాల స్థాపించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సురేందర్,సైదమ్మ, యాదగిరిస్వామి, వెంకన్న, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటకల్చరల్, జనవరి 5: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి త్రిదండి దేవనాథజీయర్‌స్వామి రానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్‌చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, మురళీధరాచార్యులు తెలిపారు.

మోతె, జనవరి 5 :పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని గద్దె దించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెళ్లి సైదులు అన్నారు. ఎన్నికల సమయంలో రామమందిర నిర్మాణ సెంటిమెంట్‌ను తెరమీదకు తెచ్చి మూడోసారి అధికారం చేపట్టాలనే ఆలోచనతో రామమందిరం పేరు మీద అవకాశవాద రాజకీయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, గుంటగాని యేసు, పోతయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, జనవరి 5 : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఈనెల 9న పట్టణంలో వేణుగోపాలస్వామివారి శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు వేణుగోపాలస్వామి పల్లకి మోసేందుకు అవకాశంకల్పిస్తున్నట్లు తెలిపారు.

సూర్యాపేటఅర్బన్, జనవరి 5: జిల్లా కేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో ఈనెల 31న నిర్వహించే బహుజన ఉద్యమకారుడు మారోజు వీరన్న జయంతి ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీయూఎస్ఐ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండ కోరారు. వీరన్న జయంతి సభ కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకన్న, మట్టపల్లి లింగయ్య, వావిరాల లక్ష్మణ్, రాజమౌళి, శ్రీను, సత్యం, యాదయ్య, సోమేష్ పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్, జనవరి 5: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అదికారి కె. అశోక్ జిల్లా కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు.

హుజూర్‌నగర్: జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కర్నె రాంమోహన్‌రెడ్డి,కౌన్సిలర్ రాంగోపి, ఆవిష్కరించారు.

ఆత్మకూర్(ఎస్):తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 7న నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయాల ని ఆ సంఘం జిల్లా కోశాధికారి గొల్ల వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ క్యాలెండ ర్, డైరీలను ఆవిష్కరించి మాట్లాడారు.

మద్దిరాల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం గోరెంట్ల జడ్పీహెచ్‌లో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

తుంగతుర్తి:రిటైర్డు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సంతోష్ అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి శ్రీనాథ్, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకుడు పుల్లయ్య, సంపత్‌రావు, సత్యనారాయణ, యాదగిరి, సుదాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, దాసు, లింగయ్య, లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్/నూతనల్:పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామంలో శుక్రవారం అయోధ్య రామాలయం అక్షింతలను ఇంటింటికి శ్రీరామాలయ ట్రస్టు సభ్యులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నారాబోయిన అప్పయ్య, భిక్షమయ్య, ఎగ్గడి రాంప్రసాద్, రమేష్, నకిరేకంటి వెంకటేశ్వర్లు, వైకుంఠచారి, ధనియాకుల సరిత, బొలిశెట్టి శోభ, తొగరు శిరిష, ఎగ్గడి పద్మవతి, బొలిశెట్టి భాస్కరమ్మ, సైదమ్మ, రామినేని ఉష పాల్గొన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో సర్పంచ్ తీగల కరుణశ్రీ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, ఎంపిటిసి పన్నాల రమ మల్లారెడ్డి, బీజేపీ నాయకులు కాపా రవికుమార్, మద్ది సంజీవరెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, చురికంటి చంద్రారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.